డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 7: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర అన్ని కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 14వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. రూ.500 అపరాధ రుసుముతో 18వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

సన్మానం

నరేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 7: ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డిని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీరాములు, మేనేజ్‌మెంట్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వై. జహంగీర్, కామర్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎం. గంగాధర్, ప్రొఫెసర్ కృష్ణ చైతన్య, ప్రొఫెసర్ స్మిత సంబ్రాణి పాల్గొన్నారు.

ఓయూ వీసీకి..

కుమార్‌ను సన్మానిస్తున్న ఇంజినీరింగ్ అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 7: ఉస్మానియా యూనివర్సిటీ 26వ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎం.కుమార్‌ను సివిల్ ఇంజినీరింగ్ విభాగం సన్మానించింది. ఈ కార్యక్రమంలో విభాగం హెడ్ ప్రొఫెసర్ కేఎల్ రాధిక, సీనియర్ ప్రొఫెసర్లు భీక్ష, గోపాల్‌నాయక్, రాజశేఖర్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, నవంబర్ 7: ముషీరాబాద్ నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కవాడిగూడ డివిజన్‌లో బాల ఆంజనేయస్వామి దేవాలయం లైన్‌లో గురువారం రూ.27లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, ఉన్ని కోటలో నూతన బోర్‌వెల్ పనులను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. జనాభాకు తగ్గట్టుగా నూతన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ, కవాడిగూడ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సాయి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, చందుగౌడ్, శంకర్‌ముదిరాజ్, రాజు యాదవ్, సురేశ్, మాదవి, రవియాదవ్ పాల్గొన్నారు.

వాటర్ పైపులైన్ పనుల పరిశీలన

సికింద్రాబాద్, నవంబర్7: సీతాఫల్‌మండి డబుల్ బెడ్రూమ్ నుంచి జోషి కాంపౌండ్ వరకు జరిగే స్ట్రామ్ వాటర్ పైపులైన్ పనులను కార్పొరేటర్ హేమ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులూ లేకుండా ట్రాఫిక్ పోలీస్‌లు, వాటర్ వర్క్స్ , జీహెచ్ఎంసీ అధికారులు పనులు చేపట్టాలని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా రోడ్డు తవ్వాల్సి వస్తుందని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆమె కోరారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.17 లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, అధికారులు ఏఈ కౌశిక్, వాటర్‌వర్క్స్ మేనేజర్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండిలో అధికారులతో కలిసి వాటర్ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ తదితరులు

డిప్యూటీ మేయర్‌ను కలిసిన జలమండలి మేనేజర్

నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిని తార్నాక డివిజన్ జలమండలి మేనేజర్ కుషాల్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆమె డివిజన్‌లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు.

– ఉస్మానియా యూనివర్సిటీ

తిరుమలగిరిలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

తిరుమలగిరిలో నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, ఎడ్యుకేషల్ సంస్థ ప్రతినిధులు

బొల్లారం, నవంబర్ 7: క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టేందుకు చెడు అలవాట్లు మానుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. గురువారం కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరిలో శ్రీనిధి ఎడ్యుకేషనల్ గ్రూపు, 2(టీ)బీఎన్ఎన్‌సీసీ ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీ గణేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్యాన్సర్ కారకమైన ధూమపానం, పొగాకు, మాదక ద్రవ్యాలు తీసుకోకూడదని సూచించారు. అనంతరం లాల్‌బజార్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి దవాఖానలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు నాగినేణి సరిత, మురళి ముదిరాజ్, అరవింద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహంకాళి ఆలయంలో పూజలు..

కంటోన్మెంట్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం కార్ఖాన లోని శ్రీ మహంకాళి ఆలయం ప్రాంగాణంలో పూజలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. గురువారం దేవాలయ ప్రాంగణంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, ఆలయ ప్రధాన అర్చకులతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని దేవాలయ ప్రాంగాణంలో 100 మంది పురోహితులతో లక్ష్మీగణపతి యాగం, మృత్యుంజయ, నవ చండి, శత రుద్ర యాగం పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తేలుకుంట సతీశ్‌గుప్తా, సంకీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు

సమావేశంలో మాట్లాడుతున్న జి.రాంబాబుయాదవ్

చిక్కడపల్లి, నవంబర్ 7: హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్ గుర్తింపు సంఘం ఎన్నికలకు బీఆర్‌టీయూ అనుబంధ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.రాంబాబుయాదవ్, ఎం. ఎల్లయ్య పోటీలో ఉంటారని సంఘం నాయకులు అన్నారు. గురువారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిన్ గుర్తింపు ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.రాంబాబుయాదవ్, ఎం. ఎల్లయ్య పోటీలో ఉంటారని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రాంబాబుయాదవ్ మాట్లాడుతూ.. వచ్చే యూనియన్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్‌టీయూ అనుబంధ సంఘాన్ని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన సౌకర్యాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించకుండా రద్దు చేసే ప్రయత్నం మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పి.నారాయణ, మారయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల క్రీడా అభివృద్ధికి ఎన్‌టీపీసీ చేయూత

బన్సీలాల్‌పేట్, నవంబర్ 7 : విద్యార్థుల క్రీడా అభివృద్ధి కోసం తమ సంస్థ చేయూత నందిస్తుందని ఎన్‌టీపీసీ సంస్థ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ పాణిగ్రహీ అన్నారు. ఎన్‌టీపీసీ సంస్థ గోల్డెన్ జూబిలీ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం సీఎస్ఆర్ విభాగం ద్వారా స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థకు ప్రీ ఫ్యాబ్రికేటెడ్ క్యాబిన్స్, పోర్టబుల్ టాయిలెట్లు, క్రీడా సామగ్రిని అందజేశారు. దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ అయిన ఎన్‌టీపీసీ, సామాజిక సేవలోను అగ్రగామిగా ఉన్నదని అన్నారు. ఏపీ మాజీ అదనపు ప్రభుత్వ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎన్‌టీపీసీ జీఎం పాణిగ్రహీ

రోడ్డు నిర్మాణ పనులు షురూ..

సుభాష్‌నగర్ సమీపంలోని ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ నుంచి జయ భారతి స్కూల్ చౌరస్తా వరకు నిర్మించ తలపెట్టి రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ కొలను లక్ష్మి రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ పనులను రూ. 55 లక్షలతో చేపడుతున్నట్టు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్ రెడ్డి, నాయకులు రాజేశ్‌ముదిరాజ్, దుర్గేశ్, శిరీశ్, భానుప్రసాద్, సందీప్, యాదగిరి చారి, పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

– అమీర్‌పేట్, నవంబర్ 7

మహిళా విద్యావంతుల ఫోరం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షురాలు స్వర్ణలత

ప్రధానకార్యదర్శి శ్వేత

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 7: తెలంగాణ మహిళా విద్యావంతుల ఫోరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో సమావేశమైన ఫోరం ప్రతినిధులు పాలనా పదవులలో మహిళలకు అవకాశాలు కల్పించడంపై వారు చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. చట్టసభల్లో మహిళలల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు, హత్యలను నిర్మూలించాలని అన్నారు. రోజురోజుకీ మహిళల్లో పెరుగుతున్న విద్యావంతుల శాతాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళా విద్యావంతులు పోరాడేందుకే ఈ ఫోరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఫోరం ఆవిర్భావ సభను వచ్చే నెల 20న చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఫోరం అధ్యక్షురాలిగా డాక్టర్ స్వర్ణలత వద్దిరాజు, ప్రధాన కార్యదర్శిగా తలమల్ల శ్వేత హసేన్, కోశాధికారిగా డాక్టర్ ధాత్రిక స్వప్న, సహాయ కార్యదర్శిగా డాక్టర్ రేష్మ, ఉపాధ్యక్షురాలిగా నాగపురి రోజా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

మందకృష్ణ మాదిగను కలిసిన నేతలు

ఖైరతాబాద్‌లో నిన్న జరిగిన ధర్మ యుద్ధం మహాసభకు కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ నేతలు ఏఎల్. ఆనంద్, సునీల్ కుమార్ మందకృష్ణ మాదిగను కలిసి సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి రొట్టెల సునీల్‌కుమార్‌మాదిగ, ఎం.అశోక్, సతీశ్, శ్రీకాంత్, రోషన్, శత్రు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

– బొల్లారం, నవంబర్ 7

స్కందగిరి ఆలయంలో 'మహా స్కంద షష్టి' ఉత్సవాలు

పద్మారావునగర్ స్కందగిరి ఆలయంలో జరిగిన కావడి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 7 : పద్మారావు నగర్‌లోని శ్రీస్కందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయంలో గురువారం 'మహా స్కంద షష్టి' సందర్భంగా ఫాల్గుణ కావడి ఉత్సవాలను నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు భుజాన కావడి పెట్టుకుని ఆలయం చుట్టూ గిరిప్రదక్షిణ చేశారు. మహిళలు పాలతో కూడిన కలశాలలను తలపై పెట్టుకుని గుడి చుట్టూ తిరిగి స్వామివారికి క్షీరాభిషేకం చేసి హోమంలో పాల్గొన్నారు. అలాగే, శుక్రవారం శ్రీసుబ్రమణ్య స్వామి, శ్రీవల్లి దేవసేన కల్యాణమహోత్సవం జరుగుతుందని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

సికింద్రాబాద్ పాట్ మార్కెట్ జూవెల్లర్స్ అసోసియేషన్ కార్యాయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న నార్త్ జోన్ డీసీపీ సాదనరష్మీ పెరుమాళ్, పాల్గొన్న మహంకాళీ ఏసీపీ సర్దార్‌సింగ్

మారేడ్‌పల్లి, నవంబర్ 7: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చునని నార్త్ జోన్ డీసీపీ సాదన రష్మీ పెరుమాళ్ అన్నారు. సికింద్రాబాద్ పాట్ మార్కెట్ జూవెలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 48 కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. ఒక్కొక్క సీసీ కెమెరా 100 మంది కానిస్టేబుళ్లతో సమానమని తెలిపారు. సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో నేరాలు చేసేందుకు నేరస్తులు బయపడుతారని అన్నారు. ప్రాంతాల వారీగా వ్యాపార సంఘాలు, స్వచ్ఛంధం సేవా సంఘాలు, కాలనీలు, బస్తీల వాసులు విధిగా తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొనేందుకు చొరవ చూపాలని సూచించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పోలీసు స్టేషన్‌కు అనుసంధానం చేయాలని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రతి ఒక్కరికీ పోలీసుల పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. నేరం జరిగితే నిందితులను త్వరగా పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహంకాళీ ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ఎస్ఐ మమత, సంఘము అధ్యక్షుడు అశోక్ శర్మల్ జైన్, ఉపాధ్యాక్షులు ఉత్తమ్ చంద్ జైన్, ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవాలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం

చిక్కడపల్లి, నవంబర్ 7: దోమలగూడలోని ద భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 75 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంస్థను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ద భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి సీ.జే. అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. 75 సంవత్సరాలు డైమండ్ జూబ్లీ వేడులకు 9 నుంచి 11 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కె.పి. వివేకనంద హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రాజ్‌గోపాల్, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పరమేశ్వర్ పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

ముషీరాబాద్, నవంబర్ 7: రాంనగర్‌లోని వస్త్రదుకాణంలో గురవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది రెండుగంటల పాటు శ్రమించి మంటల్ని అదుపులోకి తెచ్చారు. స్థానికుల కథనం ప్రకారం.. రాంనగర్ లోని వైష్ణవి మ్యాచింగ్ అండ్ సారీ సెంటర్‌లో రాత్రి 7గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షాపు నిర్వాహుడు సందీప్ ఫర్నిచర్‌కు చెదలు మందు కొట్టి షాపు బందు చేసి వెళ్లారు. ఆ తరువాత కొద్దిసేటికి మంటి వ్యాపించడంతో పై అంతస్తులో నివాసముంటున్న వారు గమనించి వెంటచే షాపు యాజమాని, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపు చేశారు. అయితే షాపు షట్టర్ ఎంతకూ తెరుచుకోకపోవడంతో జేసీబీ తెప్పించి షట్టర్‌ను తొలిగించి మంటలు అదుపు చేశారు. కాగా ఎంత మేర నష్టం జరిగింది తెలియాల్సి ఉందని చిక్కడపల్లి ఏసీపీ రమేశ్‌కుమార్ తెలిపారు. చిక్కడపల్లి సీఐ రాజునాయక్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్య పోరాటాల ద్వారానే ఫాసిజాన్ని ఎదుర్కొటాం

అభివాదం చేస్తున్న మంగత్ రాం పాస్ల, అశోక్ ఓంకార్

చిక్కడపల్లి, నవంబర్ 7 : ఐక్య పోరాటాల ద్వారా పాసిజాన్ని ఎదుర్కొంటామని కమ్యూనిస్టు, వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కమ్యూనిస్టు కో-ఆర్డినేషన్ కమిటీ (సీసీసీ) ఆధ్వర్యంలో జాతీయ సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా కమిటీ జాతీయ కన్వీనర్లు కామ్రేడ్ మంగత్ రాంపాస్ల, మద్దికాలయ అశోక్ ఓంకార్ మాట్లాడారు. దేశంలో మతం అనేది వందలాది సంవత్సరాల నుంచి ఉన్నదని,1925 లో ఆర్ ఎస్ఎస్ ఏర్పడ్డ తర్వాత హిందూత్వ ఎజెండా ప్రవేశ పెట్టడం ద్వారా కులం, మతం అంశాలు తెరపైకి తెచ్చారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామిక హక్కుల అణిచివేత, జైలు నిర్భందం ద్వారా ప్రశ్నించే గొంతును అణిచివేతకు గురిచేస్తుందని మండిపడ్డారు. దేశంలో కమ్యూనిస్టు, వామపక్ష, ప్రజాస్వామిక సెక్యులర్ శక్తులు మతోన్మాద కార్పొరేట్ పాసిజానికి వ్యతిరేకంగా ప్రజా ఐక్య ఉద్యమాలకు నేతృత్వం వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అధ్యక్షతన జరిగి ఈ సెమినార్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేముపల్లి వెంకట్రామయ్య, గుర్రం విజయ్‌కుమార్, కే.జీ . రాంచందర్, రెడ్ స్టార్ జాతీయ కార్యదర్శి పి..జే.జేమ్స్, ఎం.జయ కుమార్, గోవర్ధన్, జూపాక జానకి, గోవింద్ రాజులు, గంగాధర్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు అధ్యాపకులను వినియోగించవద్దు

ముషీరాబాద్, నవంబర్ 7: తెలంగాణలో నిర్వహింస్తున్న కులగణన ఇంటింటి సర్వే చేయడానికి ఉపాధ్యాయులను వినియోగించ వద్దని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొంది. సర్వేతో విద్యార్థులు నష్టపోయే ప్రమాముందని, అధ్యాపకులను వినియోగించుకోవడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర పధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు.

వాహనదారులకు అవగాహన

ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ మధుబాబు అన్నారు. గురువారం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంగాణంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్, రాంగ్ రూట్‌లో వాహనం నడపకూడదని అవగాహన కల్పించారు. ఎస్సై శ్రీకాంత్, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

– బొల్లారం, నవంబర్ 7

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి,నవంబర్7: గాంధీనగర్ డివిజన్ కాలనీల్లో నెల కొన్న మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పావని అన్నారు. డివిజన్ లోని డప్పు ఎల్లయ్య బస్తీలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరుకు గురువారం కార్పొరేటర్ జలమండలి డీజీఎం కార్తీక్ రెడ్డి, మేనేజర్ శ్రీదర్‌తో కలిసి బస్తీలో పర్యటించారు. బస్తీలో నెల కొన్న మంచినీటి లోప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కారించాలని అన్నారు. బీజేపీ నాయకుడు ఎ.వినయ్‌కుమార్, ఉమేశ్, బాలకృష్ణ, రాజయ్య, బస్తీవాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 7: ఆజామాబాద్ డివిజన్ అప్కో, బర్కత్‌పుర ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు..

బర్కత్‌పూర ఫీడర్ పరిధిలోని బర్కత్‌పుర, పద్మ కాలనీ, శంకర్‌మంత్ వెజ్‌టేబుల్ మార్కెట్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారు.

మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు..

అప్కో ఫీడర్ పరిధిలోని నారాయణగూడ వాటర్ వర్క్స్, కెనరా బ్యాంక్, శాంతి థియేటర్, విఠల్‌వాడి, తెలంగాణ టూరిజం, తెలుగు అకాడమీ పరిసర పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.